క్లుప్తంగా

నేడు ఎన్పీ కుంటలో ఆర్బీకే ప్రారంభోత్సవం

ఎన్పీకుంట: మండల కేంద్రంలో రూ.21.80 లక్షలతో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన ఎస్.పీ.కుంట-2 'రైతుభరోసా' కేంద్రాన్ని గురువారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రారంభిస్తారని ఎంపీపీ ఈటి రాము ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

10న ఉచిత కంటి శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 10న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో బుధవారం రోటరీక్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరం కరపత్రాలు విడుదల చేశారు. కంటిచూపు తగ్గిన పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ కోశాధికారి సుదర్శన్‌గుప్త, క్యాంపు చైర్మన్లు నరేంద్రరెడ్డి, రమేష్‌బాబు, సభ్యులు సోలిగాళ్ల వెంకటేషులు, సత్రసాల ప్రసన్నకుమార్, రత్నశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

10న ఓబుళంపల్లిలో..

చెన్నేకొత్తపల్లి: పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన ఓబుళంపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో అన్ని రకాల వ్యాధులకు ఉచిత చికిత్సలతో పాటు మందులు అందజేస్తామన్నారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులు తమ ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ తీసుకుని రావాలని సూచించారు.

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు



తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి గ్రామంలో బుధవారం రూ. 3 లక్షల పంచాయతీ నిధులతో సర్పంచ్ శాంతాబాయ్ మూడు వీధులకు తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. తాగునీటి సమస్య తీర్చాలని ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డిని గ్రామస్తులు కోరారు. స్పందించిన ఆయన సత్వరం తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గోశాలకు ఆవుల తరలింపు

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న ఆవులను తరలించేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి ఆదేశాలతో కార్యదర్శి సంగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి అశోక్‌నగర్ ప్రాంతంలో రోడ్లపై ఉన్న ఆవులను తరలించేందుకు యత్నించారు. ఈ క్రమంలో అశోక్‌నగర్‌కు చెందిన ఆవుల యజమాని విజయేంద్ర అడ్డుకునే ప్రయత్నం చేశాడు. నగర ప్రజలు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గిస్తున్న ఆవులను గోశాలకు తరలిస్తుంటే అడ్డుకోవడం సరికాదని కార్యదర్శి సంగం శ్రీనివాసులు హితవు పలికారు. కానీ విజయేంద్ర అధికారుల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు వన్‌టౌన్ పీఎస్‌లో అతడిపై ఫిర్యాదు చేశారు. ఆవులను ఎక్కడపడితే అక్కడ వదలకూడదని ఆవుల యజమానులకు విజ్ఞప్తి చేశారు.

వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు



వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

కనగానపల్లి: గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని వేపకుంట గ్రామంలో పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఎస్సీ కాలనీలో సాకే నారాయణమ్మకు చెందిన ఇంటి పైకప్పు కూలిపోయింది. దీంతో ఇంట్లోని ధాన్యంతో పాటు సామగ్రి తడిసిపోయింది. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది. అలాగే ఎస్సీ కాలనీలో మరో రెండు ఇళ్లు కూడా వర్షాలకు దెబ్బతిన్నాయని గ్రామస్తులు తెలిపారు. ఇళ్లను పరిశీలించి నష్టపరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

కృష్ణా ముకుందా మురారీ..

● అట్టహాసంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుని వేషధారణలో ఆకట్టుకుంటున్న చిన్నారి



ముదిగుబ్బ: కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో బుధవారం యాదవ సంఘం నాయకులు, ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, బాలానారాయణ స్వామి, నాగభూషణ, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణుని ప్రతిమను సొసైటీ ఆవరణంలో ఏర్పాటు చేయడంతో వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ స్టేట్ లీగల్ సెల్ మెంబర్ రమణయాదవ్ హాజరయ్యారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా యాదవ సంఘం కమిటీ సభ్యులు కొట్టాల క్రిష్ణ, వేణుగోపాల్ తదితరులు ఏర్పాట్లు చేశారు.

కదిరి టౌన్: పట్టణంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శివాలయం, వాసవీ మాత ఆలయం, మరకత మహాలక్ష్మి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు చోట్ల చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలతో ఆకర్షణగా నిలిచారు.

కదిరి అర్బన్: స్థానిక షిర్డీసాయి హైస్కూల్‌లో బుధవారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు కృష్ణుడు, గోపిక, రాధల వేషధారణతో చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురేష్‌తో పాటు పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో..

కొత్తచెరువు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా జన్మాష్టమి వేడుకలను కొత్తచెరువులో ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. పుట్టపర్తి రహదారిలోని త్రైత సిద్ధాంత వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. రంగురంగుల పూలతో అలంకరించి విద్యుత్ అలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

ధర్మవరంలో...

ధర్మవరం రూరల్: పట్టణంలోని కొత్తపేట ఉషోదయ స్కూల్‌లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షంషాద్ బేగం హాజరయ్యారు. చిన్నారులు శ్రీకృష్ణుని, రాధల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చాంద్‌బాషా, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బత్తలపల్లి మండలంలో..

బత్తలపల్లి: బత్తలపల్లిలో ఈడిగ నాగేంద్ర, ప్రబోధానంద భక్తుల ఆధ్వర్యంలో, షిర్డీసాయిబాబా మందిరంలోనూ బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవోపేతంగా జరుపుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. కృష్ణజపంతో బత్తలపల్లి మార్మోగింది. శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కోలాటం, భజనలతో ఊరేగింపు కొనసాగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ఈదుల ముష్టూరు, సంజీవపురం, సంగాల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంగమేశ్వరంలో వేడుకలు కనులపండువగా జరిగాయి. పోట్లమర్రి శివాలయంలో కృష్ణ జయంతి వేడుకలు వైభవంగా జరిగినట్లు అర్చకులు మల్లేసు తెలిపారు. చిన్నారులను శ్రీకృష్ణుని వేషధారణలతో అలంకరించి మురిసిపోయారు. వేడుకల్లో మదనాపు కొండన్న, నాయుడు, ద్రాక్షాయణి, నాగేంద్ర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● బత్తలపల్లిలోని శ్రీజ్యోతి హైస్కూల్‌లో చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలో నృత్యాలు చేశారు. గోపికల వేషధారణలో బాలికలు కూడా నృత్యాలు చేశారు. చిన్నారులతో ఉట్టి కొట్టించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ధర్మతేజ, నాగ పెద్దిరాజు, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ప్రత్యేక టెంట్‌ను ఏర్పాటు చేసి అందులో శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. గురువారం కృష్ణుడి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు.



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ధర్మవరం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షంషాద్‌బేగం

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కనగానపల్లి, కోనాపురం, బాలేపాళ్యం, బద్దలాపురం, తగరకుంట, భానుకోట గ్రామాల్లోని యాదవులు శ్రీకృష్ణుడి విగ్రహాలను మండపాల్లో కొలువుదీర్చారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పలుచోట్ల పిల్లలను బాలకృష్ణులు, గోపికలుగా అలకరించారు. సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రామాల్లో సందడి

అమడగూరు: ఓడీచెరువు, అమడగూరు మండలాల్లో బుధవారం కృష్ణాష్టమి వేడుకల సందడి నెలకొంది. గ్రామాల్లోని చిన్నారులను తల్లిదండ్రులు కృష్ణుడిగా అలంకరించారు. పలు పాఠశాలల్లో ఉట్టి కొట్టించే కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాయిగీతా స్కూల్‌లో..

ప్రశాంతి నిలయం: పట్టణంలోని సాయిగీతా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. చిన్నారులు శ్రీ కృష్ణుడు,సత్యభామ,గోపికల వేషధారణలో సందడి చేశారు. శ్రీ కృష్ణుడిని కీర్తిస్తూ గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా అంటూ చక్కటి భక్తిగీతాలు ఆలపిస్తూ వాటికి అనుగుణంగా నృత్యప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సాయిగీత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం మానస నృత్య కళాకేంద్రం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సహకారంతో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరై శ్రీకృష్ణ, గోపికల వేషధారణలోని చిన్నారులను అభినందించారు. అనంతరం శ్రీ కృష్ణుని పాటలకు చిన్ని కృష్ణులు చేసిన డ్యాన్స్‌లు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆనందయ్య, మానస నృత్య కళాకేంద్రం అధ్యక్షురాలు మానస, మున్సిపల్ వైస్ చైర్మన్ షంషాద్‌బేగం, వార్డు సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ చాంద్‌బాషా, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి మండలంలో...



తాడిమర్రి: స్థానిక వీరభద్రయ్యస్వామి దేవాలయంలో బుధవారం భక్తులు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండపాన్ని అందంగా ఏర్పాటు చేశారు. అనంతరం భగవాన్ శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీతను చదివి వినిపించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకృష్ణుని విగ్రహాన్ని శనివారం గ్రామంలో ప్రధాన వీధుల్లో ఊరేగిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఊరేగింపులో కీలుగుర్రాలు, డీజే ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



ధర్మవరంలో శ్రీకృష్ణుడు, గోపిక వేషధారులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి



పూజలందుకున్న శ్రీకృష్ణుడి విగ్రహం



బత్తలపల్లిలో బాబా చిత్రపటం ఊరేగిస్తున్న దృశ్యం



కనగానపల్లి: కోనాపురంలో పూజలు చేస్తున్న భక్తులు

అదానీ, అంబానీలకు దోచి పెట్టడమే మోదీ పని

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

కదిరి టౌన్: దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచి పెట్టడమే ధ్యేయంగా ప్రధాని మోదీ పాలన సాగిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతోన్మాద రాజకీయాలు ప్రజలకు ప్రమాదకరంగా మారాయన్నారు. 28 ప్రతిపక్ష పార్టీలు త్వరలోనే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమన్నారు. భయంతో ఇండియా పేరు మార్చడానికి సిద్ధపడటం హేయమైన చర్య అన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ త్యాగాలకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సాగుతున్న బస్సు యాత్ర సెప్టెంబర్ 8న తిరుపతిలో ముగియనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి, రామచంద్రయ్య, ఈశ్వరయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వస్తువుల చోరీ

కొత్తచెరువు: ధర్మవరం రహదారిలోని జగనన్న కాలనీలో ఇంటి అవసరాల కోసం తెచ్చుకున్న ఎలక్ట్రికల్ వస్తువులు చోరీకి గురైనట్లు బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాల మేరకు జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వెంకటలక్ష్మమ్మ తన ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా ఇంటికి తెచ్చుకున్న మోటారు, మూడు కట్టల ఎలక్ట్రికల్ వైరు, ఇంటిలో ఉన్న సామగ్రి దాదాపు రూ.60 వేలు విలువ చేసే వస్తువులు చోరీకి గురైనట్లు బాధితురాలు తెలిపింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న సరితాల బాష

ధర్మవరం అర్బన్: పట్టణంలోని 28వవార్డు కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డికాలనీలో రామాలయం నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సరితాల బాష రూ.50 వేల విరాళం అందించారు. కాలనీలో బుధవారం రామాలయం వద్దకు వెళ్లి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సరితాల బాష నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

సన్మానం



కదిరి టౌన్: ఎస్కేయూ పాలకమండలి సభ్యుడిగా నియమితులైన కొమ్ము విజయ భాస్కర్‌ను బుధవారం పట్టణంలోని రిషిత చిన్న పిల్లల హాస్పిటల్‌లో ఏపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ సీవీ మదన్‌కుమార్ ఆధ్వర్యంలో దుశ్శాలువలతో సన్మానించారు. విజయ భాస్కర్ పాలకమండలి సభ్యునిగా ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, సీవీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్: గోకులాష్టమి పండగను పురస్కరించుకొని గురువారం శిల్పారామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నరసింహులు యాదవ్, లక్ష్మీ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 వరకూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

9న లోక్ అదాలత్



విలేకరులతో మాట్లాడుతున్న జడ్జి రాకేష్

పుట్టపర్తి అర్బన్: రాజీ కాగల కేసులకు లోక్ అదాలత్‌లో శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఈనెల 9వ తేదీన జరగనున్న మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి కోర్టు చాంబర్‌లో లోక్ అదాలత్‌పై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి తగాదాలకే గొడవపడి విలువైన సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరూ సమన్వయం చేసుకుంటే దీర్ఘకాలిక కేసులకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రాంసరీ నోటు కేసుల్లో అసలు, వడ్డీ కలుపుకొని కోర్టు ఫీజు చెల్లించి వ్యాజ్యం దాఖలు చేస్తారన్నారు.లోక్ అదాలత్‌లో రాజీ కుదిరితే కోర్టుకు చెల్లించిన స్టాంప్‌డ్యూటీ మొత్తం వాపసు చేస్తామన్నారు. వివాదాల పరిష్కారానికి లోక్‌అదాలత్ చక్కటి వేదిక అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగిరెడ్డి, న్యాయవాదులు శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, పూజారి ప్రసాద్, యదుభూషణ, నాగేంద్ర, కృష్ణప్రసాద్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై దాడి



టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడిన హరి

బత్తలపల్లి: మండలంలోని వెంకటగారిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు .. గ్రామంలో టీడీపీ హయాంలో కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో కొత్తగా ఎస్టిమేట్‌లు వేసి ప్రస్తుతం అధికారులు నివేదికలు పంపారు. ఇందులో గ్రామంలోని కొందరు వ్యక్తులు గుడ్డలు వేసుకొని ఉండడంతో ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కమ్యూనిటీ భవనం వద్దకు వెళ్లి ఖాళీ చేయాలని సూచిస్తుండగానే.. టీడీపీ వర్గీయులు బాబు, నాగభూషణ, నాగరాజులు ఖాళీ చేసేది లేదంటూ అడ్డుపడ్డారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిని దుర్భాషలాడుతూ ఘర్షణకు దిగారు. వైఎస్సార్‌సీపీ వర్గీయులు వెంకటరాముడు, నరేష్, అంజి అక్కడకు చేరుకుని అడ్డుకోగా.. వారిపై దాడికి దిగారు. క్షతగాత్రులను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పెనుకొండ: పులేకమ్మ ఆలయం వద్ద బుధవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో నలుగురు గాయపడ్డారు. హిందూపురానికి చెందిన బ్యాంకు ఉద్యోగి పవన్‌కుమార్, భార్య సునంద, కుమార్తెలు రమ్యవైష్ణవి, పూజితలతో కలసి హిందూపురం నుంచి పెనుకొండకు విహారయాత్రకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పులేకమ్మ ఆలయం వద్ద 44వ జాతీయ రహదారిపై ఆవును తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి.

కదిరిలో వడ్డెర పీఠాధిపతి పర్యటన



స్వామివారిని ఆహ్వానిస్తున్న బత్తల కుటుంబం

కదిరి టౌన్: కర్ణాటకలోని వడ్డెర గురుపీఠం పీఠాధిపతి ఇమిడి సిద్దరామేశ్వర స్వామి బుధవారం కదిరిలో పర్యటించారు. డాక్టర్ మదన్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. డాక్టర్ కుటుంబ సభ్యులను స్వామీజీ ఆశీర్వదించారు.

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసానికి బుధవారం సిద్దరామేశ్వర స్వామి విచ్చేశారు. బత్తల కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాహన వేలంతో రూ. 9 లక్షల ఆదాయం

కదిరి టౌన్: కదిరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో ఇప్పటి దాకా పట్టుబడిన వాహనాల వేలం ద్వారా దాదాపు రూ.9,34,300 ఆదాయం వచ్చినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పరివర్తన 2.0 కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి దాకా 187 కేసులు నమోదు చేసి 180 మందిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. 490 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొన్నామన్నారు. 15,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే, 372 లీటర్ల కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్యాంబ్లింగ్ కేసుల్లో 40 మందిని అరెస్ట్ చేసి, రూ.81,100 సీజ్ చేశామన్నారు. 220 టన్నుల ఇసుక సీజ్ చేసినట్లు తెలిపారు. మద్యం అక్రమంగా అమ్ముతున్నా, తయారు చేస్తున్నా 9440902569 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

జరిమానాతో ఎక్సైజ్ కేసుల పరిష్కారం

కదిరి అర్బన్: సుంకం చెల్లించిన మద్యం, సుంకం చెల్లించని ఇతర రాష్ట్రాల మద్యం కేసుల్లో తొలిసారిగా పట్టుబడిన వారు జరిమానా చెల్లించి కేసు పరిష్కారం చేసుకోవచ్చని కదిరి సెబ్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుంకం చెల్లించిన మద్యం విలువకు మూడు రెట్లు, సుంకం చెల్లించని ఇతర రాష్ట్రాల మద్యం విలువకు ఐదు రెట్లు జరిమానా కట్టాల్సి ఉంటుందన్నారు. తొలిసారి పట్టుబడిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

'నాటుసారా విక్రయాలు అరికడుతున్నాం'

కొత్తచెరువు: కొత్తచెరువు సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని సర్కిల్ సీఐ రాగిరి రామయ్య తెలిపారు. సర్కిల్‌లో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందికి వీటిపై ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పేకాట, జూదం, నాటుసారా తయారీ, అమ్మకాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసు అధికారులు గ్రామాల్లో రాత్రి వేళ ప్రజలతో మమేకమై ఎలాంటి సమస్యలు, కక్షలు, గొడవలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించాలని ప్రజలకు సూచిస్తున్నారన్నారు.

అందుబాటులో ప్రత్యామ్నాయ విత్తనం

ధర్మవరం రూరల్: ఖరీఫ్‌లో వర్షాభావం వల్ల పంటలు సాగు చేసుకోలేని రైతులు ప్రత్యామ్నాయ విత్తనం కోసం రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి ముస్తఫా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉలవలు 80 శాతం రాయితీతో సరఫరా పంపిణీ చేస్తామన్నారు. క్వింటాలు ధర రూ. 10,800 కాగా సబ్సిడీ రూ. 8,640 మినహాయించి రూ. 2,160తో రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఎకరాకు 10 కేజీల చొప్పున గరిష్ఠంగా 5 ఎకరాలకు వరకు విత్తనం ఇవ్వడం జరుగుతుందన్నారు. కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు